క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ : భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బర్మావీధిలోని సాయిబాబా ఫంక్షన్ హాలులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్కౌట్స్ మాస్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ప్రముఖ ఎముకలు, నరముల డాక్టర్ నిరీశ్‌రెడ్డి పర్యవేక్షణలో వైద్య శిబిరం జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు



పీలేరు రూరల్ : పీలేరు నియోజకవర్గంలో వచ్చి పలు సమస్యల పరిష్కారానికి 95 పనులకు గానూ రూ.2.34 కోట్లు నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డీఈ భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు మండలంలోని 7 పనులకు గానూ రూ.11.50 లక్షలు, వాల్మీకిపురం 34 పనులకు రూ. 82.55 లక్షలు, గుర్రంకొండ 17 పనులకు రూ.47.50 లక్షలు, కలకడ 18 పనులకు రూ.47.40 లక్షలు, కలికిరి 2 పనులకు రూ.7.50 లక్షలు, కేవీపల్లె 17 పనులకు రూ.38 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఇప్పటి వరకు 49 పనులు పూర్తి అయ్యాయని, వాటికి రూ.1.40 కోట్లు బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన పనులు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి

మదనపల్లె : పట్టణంలో రాత్రి సమయంలో ఆటోలు నడిపేవారు నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా కోరారు. గురువారం సాయంత్రం ఆటోడ్రైవర్లతో సమావేశమైన ఆయన అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అర్ధరాత్రి సమయంలో ఆటోలు నడిపేవారు ఎక్కువగా మద్యం సేవించి నడుపుతున్నట్లు, యాక్సిడెంట్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆటోలో ప్రయాణించే వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే తమ దృష్టికి తేవాలన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌లో కంటి చికిత్సలు

రామసముద్రం : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అవ్వా, తాతలకు కంటి చూపు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని రామసముద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీల తెలిపారు. గురువారం కుదురుచీమనపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవ్వా, తాతల కంటిని పరిశీలించి వారికి అవసరమైతే ప్రభుత్వం తరఫున ఉచితంగా కంటి అద్దాలను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అనేక ఆనారోగ్యాలకు 104 నుంచి చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిపి, షుగర్ పరిశీలించి వారికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి , కంటి చూపు వైద్యాధికారి అర్జున్‌రెడ్డి, ఏఎన్ఎం సుగుణమ్మ, ఎంఎల్‌హెచ్‌పి జయరాం, ఆశా కార్యకర్తలు రాధమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా సావిత్రి

వాల్మీకిపురం: వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా సావిత్రి బాధ్యతలు చేపట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు సావిత్రి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరనాథ రెడ్డి, నాగరాజ, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పీలేరు రూరల్ : బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుధాకర్‌బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం బాబూ జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొప్ప సంఘ సంస్కర్త, భారత ఉపప్రధాని, రైల్వే శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా పార్లమెంటులో సుమారు 40 సంవత్సరాలు పని చేసి దళితుల అభివృద్ధి కోసం పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు తిమ్మయ్య, రామాంజులు, హరి, బాలకృష్ణ, అబ్బునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన

తంబళ్లపల్లె : ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని స్పెషల్ ఆఫీసర్ జిల్లా అధికారి సందప్ప తెలిపారు. గురువారం రేణుమాకులపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామవలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల ఉద్యోగులు ఇంటింటా సర్వేలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు పరుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ దళారీల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ చేస్తూ పాలన సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. డాక్టర్ ఆశాలత ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం జరిగింది. పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి వైద్య సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మహ్మద్‌అలీ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఏపీయం గంగాధర్, వాటర్‌షెడ్ చైర్మన్ ప్రకాష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సాకెమ్మ, వీఆర్వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ సంక్షేమ ఫలాలు

కలికిరి : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్షతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని రాష్ట్ర మైనార్టీ కమిషన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ అన్నారు. మండలంలోని చీకటిపల్లి, మహల్ గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రకాల ధృవీకరణ పత్రాల కోసం ప్రజలు ప్రభుత్వ



తంబళ్లపల్లె: మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ సందప్ప



కురబలకోట : మాట్లాడుతున్న బైసాని చంద్రశేఖర్‌రెడ్డి

కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దనే తీసుకునే విధంగా జగనన్న సురక్ష అమలవుతోందని, ఎలాంటి కనీస రుసుం లేకుండా ప్రజలకు 11 రకాల ధృవీకరణ పత్రాలు ఇవ్వడం గర్వకారణమన్నారు. కార్యక్రమాలలో ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, తహశీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు సురేంద్రనాథరెడ్డి, గంగయ్య, జేసీఎస్ కన్వీనర్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వర పరిష్కారం

పీలేరు : జగనన్న సురక్షతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా అన్నారు. స్థానిక 3వ గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీలో సర్పంచ్ బిసి.జయలక్ష్మీదేవి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ధనుంజయులు, ఎంపీడీవో మురళీమోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, జి.వి.రాకేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, నాగభూషణం, ఉదయ్, ఆనంద్, మునీర్, అబీద్, నరేష్‌రెడ్డి, డీటీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పేదల పాలిట వరం

కురబలకోట : జగనన్న సురక్ష కార్యక్రమం పేద, మధ్య తరగతి వారి పాలిట వరమని మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బి.దస్తగిరి అన్నారు. కురబలకోటలో సర్పంచ్ సుక్కా సుజాత, తెట్టులో సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష సభలు జరిగాయి. జడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎస్వీఆర్, ఈశ్వర్‌రెడ్డి, స్టేషన్ మనోహర్, ఆర్‌కె కృష్ణారెడ్డి, కొరివి జగన్నాథరెడ్డి, ఉప సర్పంచ్ రజనీ రాజశేఖర్, మాజీ ఉప సర్పంచ్ నారాయణ, యాసాన్, శేషగిరిరావు, ముస్తాక్, రహీం తదితరులుపాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

పెద్దతిప్పసముద్రం : రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. మండలంలోని మల్లెలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకంఠరెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంకట్, ఏకేఆర్, ఆనందరెడ్డి, మదుమూరు భాస్కర్ నాయుడుల సమక్షంలో ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



కలికిరి: ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్

సేవలను సద్వినియోగం చేసుకోండి

బి.కొత్తకోట : ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందిస్తున్న 11 సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రఫీక్ అహ్మద్ కోరారు. గురువారం మండలంలోని బయ్యప్పగారిపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉచితంగా సేవలు అందించడం జరగలేదని అన్నారు. అధికారులు ప్రజల వద్దకే వచ్చి సేవలు అందిస్తుండటం ఇదో చరిత్రని అన్నారు. ఎంపీడీఓ శంకరయ్య, సర్పంచు లక్ష్మీదేవి, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర,సర్పంచులు లక్ష్మిదేవి, భీమిగానినాగిరెడ్డి, ఎంపీటీసీ రమాదేవి, రామ్మోహన్‌రెడ్డి, రిటైర్డ్ జేడీ శివారెడ్డి, కోఆప్షన్‌సభ్యులు నాసిర్‌వలీ, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డిహరి, వీఆర్‌ఓ సోము, కార్యదర్శి లావణ్య, ప్రజలు పాల్గొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన జరిగిన జగనన్న సురక్ష సభలో నగర పంచాయతీ మేనేజర్ రమాదేవి మాట్లాడుతూ సేవలు పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. డీటీ అహ్మద్ అన్సారీ, ఆర్ఓ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్, నాయకులు ఎస్ఎస్.ఫయాజ్, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.

సమస్యలు తీర్చడానికే 'జగనన్న సురక్ష'

పెద్దమండ్యం : ప్రతి గడపలోని సమస్యలను తీర్చడానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎండిసి అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. మండలంలోని కలిచెర్ల గ్రామ సచివాలయంలో గురువారం వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథ, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, వీఆర్‌వో శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి ఖాదర్‌బాషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

నేడు ముసలికుంట, సీ గొల్లపల్లెలో..

పెద్దమండ్యం మండలంలోని ముసలికుంట, సీ గొల్లపల్లె గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. జగనన్న సురక్ష సర్వేలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను మండల స్థాయి అధికారుల బృందం పరిష్కరిస్తారని చెప్పారు. జగనన్న సురక్ష క్యాంప్‌ల్లో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు : యువత ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం నాగరాజు అన్నారు. గురువారం స్థానిక సీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసం అనంతరం అనువైన ఉద్యోగం సంపాదించడం ద్వారా జీవితంపై పట్టు లభిస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణతోపాటు యువతకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా సుమారు 50 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలకు 310 మంది అభ్యర్థులు



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం నాగరాజు

ఎంపికైనట్లు నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతల విజయభాస్కర్‌రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు బోదేషావలి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

తంబళ్లపల్లె : మండలంలో కష్టాలతో అవస్థలు పడుతున్న ఒక్కలిగర(మొరుసుకాపులు) బాధిత కుటుంబాలకు ములకలచెరువు మండలం కదిరినాతునికోటకు చెందిన పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి గురువారం ఆర్థికసాయం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కోసువారిపల్లె పంచాయతీ ఎర్రివారిపల్లెకు చెందిన ఎర్రంరెడ్డి ఈ మధ్యకాలంలో మృతి చెందాడు. చక్కవారిపల్లెకు చెందిన సుదర్శన్‌రెడ్డి కరోనా బారినపడి మృతి చెందాడు. అదే విధంగా గోళ్లపల్లెవారిపల్లెకు చెందిన మల్‌రెడ్డి అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న జయచంద్రారెడ్డి మొరుసుకాపుసంఘం నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున



బాధితురాలికి ఆర్థికసాయం అందజేస్తున్న పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి

ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మొరుసుకాపురెడ్లు అందరూ ఐక్యంగా తమ హక్కులను సాధించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఆ సంఘం నాయకులు ఆంజనేయరెడ్డి, శివారెడ్డి మస్తాన్‌రెడ్డి, మల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ

కలికిరి : ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానంపై జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రెండవ విడత శిక్షణా కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలోని కలికిరి, పీలేరు, కేవీపల్లి, కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలతో పాటు సంబేపల్లి మండలాల నుంచి 244 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓలు కరీముల్లా, నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తయారు చేయాలనే లక్ష్యంతో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించిందన్నారు. శిక్షణలో భాగంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పి) వినియోగం, బైజూస్ కంటెంట్ ఉపయోగం,



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

ఈ లెర్నింగ్‌పై ఉపాధ్యాయులకు తెలియచేయడం జరుగుతుందని, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాల్సి ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్లు నూర్‌మొహమ్మద్, కేశవకుమార్, దుర్గారావు, రాజు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

కలికిరి : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రహీముల్లా అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలపై గురువారం స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వాహనదారులు పోలీసుల కోసం కాకుండా సొంత భద్రత, కుటుంబం కోసం రోడ్డు నియమాలు పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని తెలిసినా అతివేగంతో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, పోలీసులకు పట్టుబడితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రహీముల్లా

మున్సిపల్ స్కూల్స్ స్వీపర్ల నిరసన

మదనపల్లె : మున్సిపల్ స్కూల్స్ స్వీపర్లను పారిశుధ్య కార్మికులుగా పరిగణించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ స్కూల్స్ స్వీపర్లతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్స్, మున్సిపాలిటీల పరిధిలోని స్కూల్స్‌లో పార్ట్‌టైం, కంటింజెంట్ వర్కర్స్‌గా స్వీపర్లు దశాబ్దాలుగా పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలను కలిసి స్కూల్స్ స్వీపర్ల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి దేవ, రవి, పాఠశాలల స్వీపర్స్ మాధవి, శివమ్మ, అమల, జమునమ్మ, అలివేలమ్మ, సుబ్బలక్ష్మి, రెడ్డెమ్మ, ఫరీదా, మహబూబ్‌జాన్, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమిలో అక్రమంగా ప్రవేశించిన వారిపై కేసు

మదనపల్లె : ఎగువకురవంక సమీపంలోని భువనేశ్వరి అమ్మవారి ఆలయానికి చెందిన స్థలంలో అక్రమంగా ప్రవేశించడమే కాకుండా ఆలయ సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎగువకురవంకకు చెందిన వెంకటస్వామినాయుడు, శ్రీనివాసులునాయుడు, కరుణాకర్‌నాయుడులు భువనేశ్వరి అమ్మవారి ఆలయానికి చెందిన భూముల్లోకి అక్రమంగా ప్రవేశించారు. దీనిపై ఆలయంలో పని చేసే శ్రీనివాసులు నాయుడు వారిని అడ్డుకుంటే, ఆగ్రహించిన వారు అసభ్యంగా తిడుతూ, చంపేస్తామని బెదిరించారు. దీంతో శ్రీనివాసులునాయుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆలయస్థలంలోకి అక్రమంగా ప్రవేశించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

మదనపల్లె : పట్టణంలోని కోమటివానిచెరువు కట్టపై గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని దుబ్బిగానిపల్లె పంచాయతీ గౌడసానివారిపల్లెకు చెందిన రవి(40), స్నేహితుడు కల్యాణ్(38) బైకులో కోమటివానిచెరువు కట్టపై వస్తుండగా, సైదాపేటకు చెందిన సయ్యద్‌బాషా(38) మరో బైక్‌పై ఎదురుగా వస్తున్నాడు. ఈ రెండు బైక్‌లు ఢీకొనడంతో వారు ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని చికిత్సల నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రాయితీపై పరికరాల పంపిణీ

పెద్దతిప్పసముద్రం : ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని సంపతికోటలో వాటర్‌షెడ్ ద్వారా రైతులకు రాయితీపై పరికరాలు అందజేశారు. పీవీసీ పైపులు, పెట్రోల్ పంపులు, టార్పాలిన్ పట్టలు లాంటి వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీవో ఖాజా మొహిద్దీన్, టీవో మేఘనాథం , చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాఘవేంద్ర, సర్పంచ్ రెడ్డెప్ప, ఎంపీటీసీ కిట్టన్న పాల్గొన్నారు.

స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె : మదనపల్లె సబ్‌డివిజనల్ పోలీస్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కేశప్ప అన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. విధి నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆదేశాల మేరకు మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ నిమిత్తం ఇద్దరు కానిస్టేబుల్స్‌ను కేటాయించి, వారికి ప్రత్యేకశిక్షణ ఇప్పించడమే కాకుండా ప్రత్యేక డ్రెస్‌కోడ్ ఇచ్చామన్నారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల సమస్యలు ఏర్పడినప్పుడు, ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుందన్న సమాచారం తెలిసినా వెంటనే సబ్ డివిజనల్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ద్వారా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామన్నారు. చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్ డివిజన్ పరిధిలో వీఐపీలు పర్యటించినప్పుడు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో తాలూకా సీఐ సత్యనారాయణ, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

ప్రతి కుటుంబం అభివృద్ధే లక్ష్యంగా పథకాలు

పీలేరు : ప్రతి కుటుంబం అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. గురువారం స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గూర్చి వివరించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తసుకురావాలని, సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రకటించిన తేదీ సంక్షేమ ఫలాలు అందిస్తూ 99 శాతం హామీలు నెరవేర్చారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పీలేరు అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో పయనిస్తోందన్నారు. మరింత అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మరోసారి జగన్‌ను ప్రజలు నిండుమనస్సుతో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



పీలేరు : ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

యువ పారిశ్రామికవేత్త జి.వి.రాకేష్‌రెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, నాయకులు గ్యారంపల్లె రమేష్‌రెడ్డి, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఎస్.వి.చలపతి, ఉదయ్‌కుమార్, బాలం నరేంద్రరెడ్డి, హుమయూన్, విజయశేఖర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, ఆనంద్, మహిత, ప్రభావతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

పీలేరురూరల్ : రైతులు మామిడి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. మామిడి పంట కోత అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై గురువారం తలపులలో మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత అనంతరం మామిడి కొమ్మలు కత్తిరించాలన్నారు. తద్వారా సూర్యరశ్మి చెట్టుకు తగిలి ఆరోగ్యంగా ఉంటాయని, చీడపీడలు దరి చేరవని తెలిపారు. వచ్చే ఏడాది నాణ్యమైన పంటదిగుబడి లభిస్తుందని చెప్పారు. సమావేశంలో హెచ్ఎం సుకుమార్‌రెడ్డి, జిల్లా రైతు సలహామండలి సభ్యుడు బోదేషా, అన్నమయ్య రైతు ఉత్పత్తి సంఘం అధ్యక్షుడు జయబ్బనాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవిచంద్రబాబు

బాల్య వివాహాలతో మాతా శిశు మరణాలు

కలికిరి: బాల్య వివాహాలతో మాతా శిశు మరణాలు సంభవిస్తాయని డీసీఎంఓ లోకవర్ధన్ అన్నారు. ప్రపంచ జనాభా పక్షోత్సవాలలో భాగంగా స్థానిక శ్రీనివాసా, మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో అధిక జానాభా, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. మండల వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అంజలిదేవి, శ్రీనివాసా కళాశాల కరస్పాండెంట్ శ్రీదర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రాబీస్ టీకాలు

మదనపల్లె సిటీ : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబీస్ టీకాలు వేశారు. వెటర్నరీ డిడి డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది జోనోసిస్‌డేకు పెంపుడు కుక్కలకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. సుమారు 128 పెంపుడు కుక్కలు,వీధికుక్కలకు టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏడీలు విశ్వేశ్వరరెడ్డి, డాక్టర్ రోహిణి, లారెన్స్, దివ్య, జిల్లా ఆస్పత్రి వైద్యులు పాల్ రవికుమార్, జూనియర్ వెటర్నటీ ఆఫీసర్స్ సుమలత, వీరాంజనేయులు, లైవ్‌స్టాక్ ఆఫీసర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : మండల పశు సంవర్థక శాఖ సిబ్బంది మండలంలోని రంగసముద్రంలో శునకాలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. 15 పెంపుడు శునకాలకు వైద్య పరీక్షలు నిర్వహించి టీకాలు వేశారు.

వాల్మీకిపురం : కుక్కలను పెంచుకునే వారంతా వారి కుక్కలకు యాంటి ర్యాపిడ్ వ్యాక్సిన్‌ను వేయించాలని స్థానిక పశువైద్య సహాయ సంచాలకులు నీరజ అన్నారు. స్థానిక పశువైద్యశాలలో ప్రజలకు అవగాహన కల్పించి, కుక్కలకు ర్యాపిడ్ వ్యాక్సిన్‌లను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొట్టమొదటిసారిగా 1885లో మొదటి టీకాను కనుగొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మదనపల్లె సిటీ : కుక్కకు టీకా వేస్తున్న వైద్యులు

కలికిరి : కుక్కలు, దూడల నుంచి సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేసినట్లు కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకటమునినాయుడు తెలిపారు. కలికిరి ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలు, పశువుల నుంచి మనుషులకు సంక్రమించే పిచ్చికుక్కవ్యాధి, బ్రూసెల్లోసిస్, పశుమసూచి, ఆంత్రాక్స్, లెప్టోస్పిరోసిస్, బర్డ్ ఫ్లూ, తామర, హైడాటిడోసిస్ తదితర వ్యాధుల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : పెంపుడు కుక్కలకు యాంటీ రాబీస్ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారిణి సుజనశ్రీ తెలిపారు. తంబళ్లపల్లె పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో భాగంగా అవగాహన సదస్సు జరిగింది. సుమారు 50 పెంపుడు కుక్కలకు యాంటీ రాబీస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.